సాక్షి మెదక్

శనివారం । 15 । ఏప్రిల్ । 2023



కొమురవెల్లిలో ఎక్కడి చెత్త అక్కడే

కొమురవెల్లి ఆలయ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. దీంతో మల్లన్న క్షేత్రం చుట్టూ కంపుకొడుతోంది. IIలో

నలుగురికి పాజిటివ్




మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం 66 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు జిల్లా వైద్యాధికారి చందూనాయక్ తెలిపారు. మెదక్ పట్టణంలో మూడు, హవేలిఘనపూర్ మండలం సర్దన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక కేసు నమోదైందని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు.



కరెంట్ షాక్‌తో హత్యకు కుట్ర

గుర్తుతెలియని వ్యక్తులు గడియకు కరెంట్ షాక్ పెట్టి కుటుంబ హత్యకు కుట్రపన్నారు. ఈసంఘటన నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్‌రావుపేటలో జరిగింది. IIలో



ఇసుకాసురులు!

- పసుపులేరు, హల్దీ వాగులో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



పసుపులేరు వాగు నుంచి ఇసుక తరలించడంతో ఏర్పడిన గుంతలు

మెదక్‌జోన్: మెదక్ పట్టణానికి ఆనుకుని ఉన్న పసుపులేరుతో పాటు హల్దీవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పట్టణానికి తాగునీరు అందించే పంప్‌హౌస్ ప్రాంతం నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక మాఫియా ముందుగానే రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ముడుపులు అప్ప చెప్పినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో రాత్రి ఏడు అయిందంటే చాలు దర్జాగా ఇసుకను తరలిస్తున్నారు. ఇది మా పరిధిలోకి రాదని పోలీసులు చేతులెత్తేయడంతో ఇక వారిని అడ్డుకునే వారే కరువయ్యారు.

చేతులెత్తేసిన పోలీసులు

పసుపులేరు వాగుపై ఆధారపడి వందలాది ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. పెద్ద మొత్తంలో ఇసుక తరలిపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. ఇసుక తరలించవద్దని అడ్డుచెబితే ఇసుక మాఫియా వారిపై దాడులకు తెగబడుతోంది. దీంతో రైతులు వారికి అడ్డు చెప్పాలంటేనే జంకుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తే వారు కనీసం పట్టించుకున్న పాపానపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్తే అది మా పరిధిలోకి రాదని చెబుతున్నారు. దీంతో ఇసుకాసురులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. మరికొన్ని రోజులు ఇలాగే కొనసాగితే వాగు నుంచి ఇసుకంతా తరలిపోయి తాగునీటి కష్టాలు ఏర్పడే ప్రమాదం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

అడ్డుకుంటున్న రైతులు

అభివృద్ధి పేరిట ఇసుకాసురులు ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి ఇసుకను కొల్లగొడుతున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదిలేక రైతులే అడ్డుకుంటున్నారు. అభివృద్ధి పనుల కోసం గత కొన్ని రోజులుగా మెదక్ మండలం బొల్లారం, సంగాయిగూడ శివారులో గల హల్దీ వాగు నుంచి ఇసుకను జేసీబీల ద్వారా ఎత్తుతున్నారు. దీంతో వాగులో జలాలు అడిగంటి పోతున్నాయి. ఫలితంగా వేలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది. అక్రమ ఇసుక రవాణా ఆపాలని అన్నిశాఖల అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో చేసేదిలేక బొల్లారం, సంగాయిగూడ తండాలకు చెందిన రైతులు ఇసుక లారీలను అడ్డుకున్నారు. గొడవ జరిగితే పోలీసులు వెళ్లి గ్రామస్తులకు సర్దిచెప్పి తాత్కాలికంగా లారీలను అక్కడి నుంచి పంపించి వేస్తున్నారు.

అనుమతి తప్పనిసరి

జిల్లాలో ముఖ్యంగా మైనింగ్ శాఖ ఉన్నా లేనట్లే అన్న చందంగా మరింది. ఇసుక, మట్టి, రాళ్లు ఇలా ఏది తవ్వాలన్నా మైనింగ్ శాఖ అనుమతి తప్పనిసరి. ఒక వేళ అనుమతి తీసుకోకుండా తరలిస్తే ఆ వాహనాన్ని సీజ్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకునే హక్కు సంబంధిత అధికారికి ఉంటుంది. కానీ జిల్లా చుట్టూ ఇప్పటికే పెద్ద పెద్ద గుట్టలను తవ్వి మట్టిని కొల్లగొట్టారు. వాగులు, వంకలు, హల్దీ, పసుపులేరు వాగుల నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తున్నా మైనింగ్ అధికారులు అటు వైపు తొంగిచూసిన పాపాన పోలేదు. గ్రామానికి ఆనుకుని ఉన్న గుట్టలను అక్రమ బ్లాస్టింగ్‌లతో ధ్వంసం చేసినా పట్టించుకోవడం లేదు.

న్యూస్‌రీల్

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా నర్సింలు



నియామకపత్రం అందుకుంటున్న నర్సింలు

శివ్వంపేట(నర్సాపూర్): ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని కొంతన్‌పల్లికి చెందిన ఆకుల నర్సింలు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జ శ్రీనివాస్ నియామకపత్రం అందజేశాడు. ఇదే గ్రామానికి చెందిన యాదగిరి ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యాడు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మెదక్‌జోన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని టీపీసీసీ ప్రతినిధులు చౌదరి సుప్రభాతరావు, మ్యాడం బాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ నుంచి మంచిర్యాల సభకు తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీ కుటిల నీతిని ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్, మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హఫీజ్ మొల్సాబ్, రమేశ్‌రెడ్డి, నాయకులు స్వామి, నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్ గౌడ్, నార్సింగి మండల అధ్యక్షుడు గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో మే 1వ తేదీ నుంచి నెలరోజుల పాటు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన, క్రీడా అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్ల లోపు బాల బాలికలకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిబిరాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి జిల్లాలోని ఆసక్తి గల సీనియర్ క్రీడాకారులు, జాతీయస్థాయి క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షకులకు రూ. 4 వేల గౌరవ వేతనంతో పాటు క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. అలాగే శిక్షణ పొందిన బాలబాలికలకు గుర్తింపు పత్రాలు ఇస్తామని... ఆసక్తి గల వారు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా మెదక్ సమీకృత కలెక్టరేట్‌లో గల జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 9347344440, 9493594388 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ భాగ్యలక్ష్మి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, మెదక్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో రూ.30 లక్షల డీఎంఎఫ్‌టీ, జెడ్పీ, ఎంపీ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాలను సర్పంచ్ బక్కి భాగ్యలక్ష్మితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: దళిత జాతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణకు జిల్లా నుంచి 16 బస్సుల ద్వారా 800 మంది ప్రజా ప్రతినిధులు తరలివెళ్లారని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఎస్పీ సైదులు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి

మనోహరాబాద్(తూప్రాన్): అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతా శేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌతోజుగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అలాగే దండుపల్లి, జీడిపల్లిలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురం నవనీత రవి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి, సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగభూషణం, రేఖ మల్లేష్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడవాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేష్

అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మెదక్ మున్సిపాలిటీ: అంబేడ్కర్ ఎన్నో అవమానాలను ఎదుర్కొని ఉన్నత విద్యనభ్యసించి దేశానికి మార్గదర్శకం చేశారని.. ఆయన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మెదక్ జీకేఆర్ గార్డెన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికి పరిమితం కాదని, అన్యాయాలపై ప్రశ్నించి సమాజంలో అసమానతలు తగ్గించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్రను, సందేశాలను అర్థం చేసుకొని ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ రమేష్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదివి హక్కులు, చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. డీఎస్పీ సైదులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలలో ఉన్న వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ఇష్టపడి చదవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, పెయింటింగ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. అలాగే సామాజిక సేవా కార్యక్రమాల్లో విశిష్ట సేవలందించిన కార్యకర్తలను సన్మానించారు. గురుకుల పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఆర్డీఓ సాయి రామ్, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంజీవ్, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి హరిప్రసాద్, కన్వీనర్ సామెల్, సభ్యులు దుర్గయ్య, బీసీ సంఘం అధ్యక్షుడు గంగారామ్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, తదితరులు

నర్సాపూర్: అంబేడ్కర్ అందరి వాడని.. ఆయన ఆశయాలు నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పిల్లల పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని 125 అడుగుల విగ్రహం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం చరిత్రాత్మకమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ముందుచూపుతో అందరికీ ఆమోదయోగ్యంగా రాశారని కొనియాడారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ బబియానాయక్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అనిత

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతి ఒక్కరూ ఉన్నతంగా చదువుకోవాలని, చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని చండూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. ప్రతి విద్యార్థికి చదువు ఎంతో ముఖ్యమని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లిష్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను సక్రమ మార్గంలో పెంచాలని సూచించారు. అనంతరం ఆడపిల్లల సమాన ఆస్తి హక్కు, ఆడపిల్లలపై జరిగే వేధింపులు, పోలీస్ చట్టాలు తదితర వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ, ఎస్ఐ మహ్మద్‌గౌస్, కార్యదర్శి జితేందర్, నాయకులు నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలిన ప్రభుత్వం

ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రజల సమస్యలను బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికొదిలి పక్క రాష్ట్రాల్లో అధికారం కోసం పాకులాడుతోందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్షకు వెళ్తూ.. మార్గమధ్యలో ప్రజ్ఞాపూర్ హరితా రెస్టారెంట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీపై అక్రమంగా కేసు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. కేరళలో జరిగిన ఘటనపై సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుతో ఎంపీ పదవిని రద్దు చేస్తూ రెండేళ్ల జైలు శిక్ష విధించడం సరికాదన్నారు. దీనిని నిరసిస్తూ మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, 10వ తరగతి పేపర్లు లీకవుతున్నాయని మండిపడ్డారు. గతంలో ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాల మూల్యాంకనం ఓ కంపెనీకి అప్పగించడంతో ఎంతో మంది విద్యార్థులు ఫెయిల్ అయి ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. నిరుద్యోగులకు రూ.3,116 భృతి ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని ఆరోపించారు. గజ్వేల్, తుర్కపల్లి, ఆలేరు ప్రాంతాల్లో వడగళ్ల వానతో పంటలు దెబ్బతింటే ఒక్క మంత్రి కూడా పరిశీలించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ బాటలో నడుస్తూ, దళితుడైన మల్లిఖార్జున ఖర్గేను ఏఐసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, తీగుల్ సర్పంచ్ భానుప్రకాష్‌రావు పాల్గొన్నారు.

వడగండ్ల బీభత్సం

దుబ్బాకలో 2,500, సిద్దిపేటలో 580 ఎకరాల్లో వరి పంట నష్టం



దుబ్బాకలో నేలవాలిన వరిచేలు

దుబ్బాకటౌన్: వడగండ్ల వర్షం దుబ్బాక మండలంలో బీభత్సం సృష్టించింది. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు, కోత దశలో కురిసిన వర్షం నిండా ముంచింది. గురువారం అర్ధరాత్రి తర్వాత ఈదురుగాలులతో పాటు వడగండ్లు పడడంతో దుబ్బాక మండలంలోని ఆయా గ్రామాల్లో వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. వడగండ్లతో వరిచేలల్లో గింజలు రాలిపోయాయి. మామిడి చెట్లు విరిగిపోయి, కాయలు నేలరాలి తీవ్ర నష్టం వాటిల్లింది. దుబ్బాక మండలంలో సుమారు 2,500 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.

90శాతం దెబ్బతిన్న పంటలు

- వడగండ్ల వానకు దుబ్బాక మండలంలో 2500 ఎకరాలకు పైగా వరి పంటకు నష్టం వాటిల్లింది.
- మామిడికాయలు పూర్తిగా రాలిపోవడంతో పాటుగా ఈదురుగాలుల ధాటికి మామిడి చెట్లు కిందపడ్డాయి.
- దుబ్బాక పట్టణంతో పాటుగా మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, రాజక్కపేట గ్రామాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి.
- చెల్లాపూర్‌లో సుమారుగా 1,300 ఎకరాల్లో 90 శాతం పైగా వరికి నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారులు తెలిపారు.
- బల్వంతాపూర్, పద్మశాలిగడ్డ, దుబ్బాక, రాజక్కపేట, మల్లాయపల్లిల్లో 70 శాతానికి పైగా వరి పంట దెబ్బతిన్నది.
- భారీగా వడగండ్లు పడడంతో వరి చేలు పూర్తిగా నేలవాలి, గింజలు రాలిపోయాయి.
- పంట నష్టం అంచనా వేసి నష్టపోయిన వారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.
- గాలి వానతో మండలంలోని చెల్లాపూర్, బల్వంతాపూర్ గ్రామాల్లో ఇండ్లు ధ్వంసం అయ్యాయి. గాలివాన ధాటికి ఇంటి రేకులు లేచిపోవడంతో బాధితులు ఇబ్బందులు పడ్డారు.
- సిద్దిపేట మండలంలోని సీతారాంపల్లి, మాచాపూర్, చింతమడక గ్రామాల్లో 580 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారి పర్శరాంరెడ్డి తెలిపారు.
- ఈ మూడు గ్రామాల్లో పర్యటించి, పంట నష్టాన్ని అంచనా వేసినట్లు తెలిపారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



వడగండ్ల వానకు నేలరాలిన వరిగింజలు



గాలివానకు కూలిన మామిడి చెట్లు

సీపీఎస్ రద్దుకు పోరుబాట

- రేపు జిల్లా కేంద్రంలో ర్యాలీ
- జిల్లాలో 4 వేల మంది ఉద్యోగులు



ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు (ఫైల్)

మెదక్‌జోన్: కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో సీపీఎస్ ఉద్యోగులు పోరుబాట పడుతున్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 16న జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగులు సుమారు 4 వేల పైచిలుకు ఉండగా..ఉద్యోగులు, ఉపాధ్యాయులు హక్కుల కోసం యూనియన్లను పక్కన పెట్టి పోరాటానికి సిద్ధం అవుతున్నారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కొంతకాలంగా విధులు నిర్వర్తిస్తూనే ఉద్యోగులు ఉద్యమాలు చేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ సెక్టార్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ అనంతరం పెన్షన్ లేకపోతే వృద్ధాప్యంలో తమ జీవితానికి భరోసా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం పాతపెన్షన్ విధానం పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ఈనెల 16వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీలు, జూన్ 2న సీపీఎస్ ఉద్యోగులకు విస్తృత అవగాహన సదస్సులు, జూలైలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్రలు, ఆగస్టు 23న హైదరాబాద్ కేంద్రంగా రాజకీయ రణరంగ మహాసభ, అక్టోబర్ 1న ఢిల్లీలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు.

అందరూ ఏకతాటిపైకి..

సీపీఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ స్కీం అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలంగాణ స్టేట్ కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ (టీఎస్‌సీపీఎస్‌ఈయూ) ప్రకటించింది. ఇందుకోసం అందరూ ఏకతాటిపైకి వచ్చారు. సాధారణ ఎన్నికలకు మరో ఆరు నెలల సమయం ఉన్నందున ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని ఉద్యోగులు భావిస్తున్నారు.

హక్కులను కాలరాస్తున్నారు



మూడు దశాబ్దాలుగా ప్రభుత్వ సెక్టార్‌లో పనిచేసిన ఉద్యోగికి పెన్షన్ లేకపోవడం ఉద్యోగుల హక్కులను హరించడమే.

– నర్సింహులు, ఉపాధ్యాయుడు

వారికి మాత్రం జీవితాంతం పెన్షన్



ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపీగా ఎన్నికైతే జీవితాంతం పెన్షన్ వర్తిస్తుంది. కానీ ఉద్యోగులకు పెన్షన్ లేకపోవడం అన్యాయం.

– దేవయ్య, టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా సమన్వయకర్త

క్లుప్తంగా

చెట్టుపై పిడుగు



నడిమితండాలో విరిగిన చెట్టు

అల్లాదుర్గం(మెదక్): చెట్టుపై పిడుగుపడింది. ఈ ఘటన అల్లాదుర్గం మండలం నడిమితండా సమీపంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఇదే టైంలో తండాకు దగ్గర్లోని చెట్టుపై పిడుగుపడింది. దీంతో చెట్టు విరిగి కిందపడింది. తండాకు దగ్గర ఈ ఘటన జరగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని గిరిజనులు పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



నర్సింగరావు(ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): రైలు పట్టాలపై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మనోహరాబాద్ మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర గరంచారి, ఎల్లవ్వల కుమారుడు ఎర్ర నర్సింగరావు (21) గురువారం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం పట్టాలపై మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అయితే నర్సింగరావు మృతికి కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



ఆకుల రాజు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడి ఓవ్యక్తి అదృశ్యమయ్యాడు. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన ఆకుల రాజు(46) పటాన్‌చెరులోని పటేల్ గూడాలో ఉంటున్నాడు. హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోలో షూటింగ్ వర్క్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 4న భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో ఆయన భార్య సత్యవతి తెలిసిన వారు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కిందపడి యువకుడి దుర్మరణం



మృతి చెందిన రాజు

రాయికోడ్(అందోల్): ఉరుముల శబ్దానికి ఓ యువకుడు కిందపడి మృతిచెందాడు. ఎస్సై ఏడుకొండలు కథనం ప్రకారం.. శంశోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన కమ్మరి రాజు (23) శుక్రవారం ఎద్దును తీసుకొని కాలినడకన వట్‌పల్లి మండలం కేంద్రంలోని పశువుల సంతకు వెళ్తున్నాడు. సిరూర్ గ్రామ శివారులోకి చేరుకోగానే ఒక్కసారిగా ఉరుములు, మెరుపుల శబ్దానికి ఎద్దు పరుగెత్తింది. ఎద్దుకు కట్టిన తాడు పట్టుకున్న రాజు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ రాజును స్థానికులు జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రిఇకి తరలించారు. అయితే అప్పటికే రాజు చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కొమురవెల్లిలో ఎక్కడి చెత్త అక్కడే

- అపరిశుభ్రంగా మల్లన్న ఆలయ పరిసరాలు
- పట్టించుకోని అధికారులు



ఆలయ వసతి గదుల వెనుక పేరుకుపోయిన చెత్త

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఆలయ పరిసరాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తదర్శనమిస్తోంది. దీంతో మల్లన్న క్షేతం చుట్టూ కంపుకొడుతోంది. స్వచ్ఛ కొమురవెల్లి.. హరిత కొమురవెల్లిగా మారుస్తామని చెబుతున్న అధికారులు.. క్షేత్రస్థాయిలో అదేమీ పట్టించుకోవడంలేదు.

నిత్యం వేలాది మంది భక్తులు...

కొమురవెల్లి మల్లన్న సన్నిధికి రోజూ వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఆలయ గెస్ట్‌హౌస్‌ల వెనుక, రోడ్ల వెంబడి, పార్కింగ్ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. భక్తులు పడేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పరిసరాల్లో దుర్వాసన వస్తోంది. అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా గ్రామస్తులు, దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రోగాల బారినపడుతున్నారు.

జోరుగా ప్లాస్టిక్ వినియోగం..

మల్లన్న సన్నిధికి వచ్చే భక్తులు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వినియోగిస్తున్నారు. వాటిని ఎక్కడపడితే అక్కడ పడేయడంతో హానికర చెత్త గుట్టలుగా పేరుకుపోతుంది. ఆఫీసర్లు ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని నిర్ణయించారు. ఇటీవల అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డీపీవో దేవికాదేవి ఆయా వ్యాపారులతో సమావేశం నిర్వహించి ప్లాస్టిక్ వాడడంతో కలిగే నష్టాలపై అవేర్నెస్ కల్పించారు. అయినా ఎవరు పట్టించుకోవడం లేదు. దీంతో ప్లాస్టిక్ వాడకం మూడు గ్లాసులు.. ఆరు ప్లేట్లుగా సాగుతోంది. ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, కొమురవెల్లి మల్లన్న క్షేత్రం క్లీన్‌గా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

చెత్త తొలగిస్తాం..



కొమురవెల్లి ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తాం. పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా చెత్త తీయడం ఆలస్యమైంది. ప్రతీవారం వచ్చే భక్తులు అక్కడే చెత్త పడేయడం సమస్యగా మారింది.

– బాలాజీ, ఈవో కొమురవెల్లి దేవాలయం

సెంటర్లు ఏర్పాటు చేస్తాం..

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో ప్లాస్టిక్ కలెక్షన్ కోసం 21 సెంటర్లు ఏర్పాటు చేస్తాం. భక్తులు ఆలయ పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి. ప్లాస్టిక్ వాడినా.. అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– లోకేశ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

రోడ్డు ప్రమాదంలో మహిళా అడ్వకేట్ మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కంది(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో మహిళా అడ్వొకేట్ మృతిచెందింది. సంగారెడ్డి రూరల్ ఎస్సై శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం... కర్నాటక రాష్ట్రంలోని బీదర్ కు చెందిన అవినాశ్, స్నేహ(30) దంపతులు ఏడాదిగా పటాన్ చెరు మండలం కొల్లూర్ లో ఉంటున్నారు. వీరికి కూతురు సాన్వి(6) ఉన్నారు. హైదరాబాద్‌లో అవినాశ్ సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తుండగా స్నేహ బీదర్ లో అడ్వొకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నారు. శుక్రవారం స్నేహ కూతురు సాన్వితో కలిసి కారులో హైదరాబాద్ నుంచి బీదర్‌కు బయలుదేరారు. ఐఐటీహెచ్ సమీపంలో రోడ్డు పక్కనుంచి వెళ్తున్న కంటైనర్ ఒక్కసారిగా కారుకు ఢీకొట్టింది. దీంతో కారు డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు పడిపోయింది. అదే టైంలో హైదరాబాద్ వెళ్తున్న సిద్దిపేట డిపోకు చెందిన బస్సు కారును మళ్లీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న స్నేహ అక్కడికక్కడే మృతిచెందగా కూతురు సాన్వి, డ్రైవర్ ధన్ రాజ్ కు తీవ్ర గాయాలయ్యాయి.మృతురాలి భర్త అవినాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దుడ్డెకు పాలిచ్చిన ఆవు



ఆవు పాలు తాగుతున్న బర్రె దూడ

ఝరాసంగం (జహీరాబాద్): దుడ్డెకు ఓ ఆవు పాలిచ్చి మాతృత్వాన్ని చాటుకుంది. శుక్రవారం ఝరాసంగంలో ఇది జరిగింది. బొప్పన్ పల్లి వెళ్లే దారిలో మహాత్మజ్యోతిరావు పూలే బాలికల పాఠశాల పక్కన దుడ్డె ఆవుపాలు తాగుతూ కనిపించింది. దీనిని అక్కడున్నవారంతా చూసి ఆశ్చర్యానికి గురయ్యారు. ఆవు తల్లిప్రేమను చాటుకుందని పేర్కొన్నారు.

కుటుంబం హత్యకు కుట్ర



తలుపు గడియకు ఇనుప రాడ్

నారాయణఖేడ్: గుర్తుతెలియని వ్యక్తులు గడియకు కరెంట్ షాక్‌పెట్టి కుటుంబం హత్యకు కుట్రపన్నారు. బాధిత కుటుంబం, గ్రామస్తుల కథనం ప్రకారం.. నారాయణఖేడ్ మండలంలోని సంజీవన్ రావుపేట గ్రామానికి చెందిన దనియాల రాములు గురువారం రాత్రి భార్య, బిడ్డ, మనవరాలితో నిద్రిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కూతురు కాలకృత్యాల కోసం లేచి గడియ తీయడానికి యత్నించి కరెంట్ షాక్‌కు గురై అరుస్తూ కింద పడిపోయింది. తల్లి నిద్రనుంచి లేచి కూతురిని పైకిలేపి ఆమె మళ్లీ గడియ తీయడానికి యత్నించి కరెంట్‌షాక్‌కు గురైంది. భయంతో రాములు, భార్య, బిడ్డ కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు రాములు ఇంటిఆవరణలో గుమిగూడారు. ఇంటిబయటి తలుపు గడియకు పక్కనున్న విద్యుత్ మీటరు నుంచి కరెంట్ కనెక్షన్ ఇచ్చి బకెట్‌లో నీళ్లు పోసి ఇనుపరాడ్ ఉంచినట్లు గమనించారు. వెంటనే కరెంట్ కనెక్షన్ తొలగించి కుటుంబ సభ్యులను ఇంట్లోనుంచి బయటకు తీసుకువచ్చారు. ఆ తర్వాత రాములు తన పొలానికి వెళ్లగా అక్కడ దుండగులు రెండు బోర్లపై పెట్రోలు పోసి నిప్పు అంటిచినట్లు గుర్తించాడు. ఘటనపై బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం ఆరాతీస్తున్నారు.

నాటుసారా పట్టివేత



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): నాటుసారా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ మహేంద్రకుమార్ కథనం ప్రకారం.. చేర్యాల శివారులో శుక్రవారం అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని తనిఖీ చేస్తుండగా దూల్మిట్ట మండలం హనుమతండాకు చెందిన ఇస్లావత్ రవి తన ద్విచక్ర వాహనంపై 4.5 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. ఆయన నుంచి సారా, టూవీలర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఆయన వెంట ఎస్సైలు వినోద్ కుమార్, సురేశ్, సిబ్బంది ఫరీద్, రవి తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

పటాన్‌చెరు టౌన్: అగ్నిప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్యానాయక్ చెప్పారు. శుక్రవారం పటాన్‌చెరు ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పరేట్ నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల కరపత్రం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ జన్యానాయక్ మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 20 వరకు వారోత్సవాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా ప్రతీ రోజు పట్టణాలు, గ్రామాల్లో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తామన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న ఫైర్ ఆఫీసర్ జన్యానాయక్



ట్యాంకర్ మీదపడి డ్రైవర్ మృతి



భిక్షపతి (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: వాటర్ ట్యాంకర్ బోల్తాపడి డ్రైవర్ మృతిచెందాడు. సిద్దిపేట త్రీటౌన్ ఎస్సై సంపత్ కథనం ప్రకారం.. మిట్టపల్లి గ్రామానికి చెందిన తాళ్ల భిక్షపతి (30) కొంతకాలంగా స్థానిక ఫయాజ్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం గ్రామ శివారులో వాటర్ ట్యాంకర్ ద్వారా చెట్లకు నీరుపట్టి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి ట్యాంకర్ భిక్షపతిపై పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో ఆవు..



నంగునూరు(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో ఆవు మృతిచెందింది. నంగునూరు మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వల్లాది లక్ష్మీనారాయణరెడ్డి శుక్రవారం తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఆవును కట్టేసి వెళ్లాడు. తాడు తెంపుకున్న ఆవు గడ్డిమేస్తూ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. పాడిఆవు మృతి చెందడంతో రూ. 80 వేల నష్టం జరిగిందని రైతు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ ఎల లత కృష్ణ, పంచాయతీ కార్యదర్శి గౌస్, విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

పిడుగుపాటుతో పశువులు..



మృతిచెందిన ఆవులు

రేగోడ్(మెదక్): పిడుగుపాటుకు మూడు ఆవులు మృతిచెందాయి.జగిర్యాల గ్రామానికి చెందిన బక్కయ్య కొట్టంపై గురువారం అర్ధ రాత్రి పిడుగుపడడంతో రెండు ఆవులు, లేగ దూడ మృతి చెందాయి. పాడిపశువులు మృతి చెందడంతో రూ.1.70 లక్షల నష్టం జరిగిందని బాధితుడు బక్కయ్య తెలిపాడు. తహసీల్దార్ లక్ష్మణ్ పంచనామా చేశారు.

దుబ్బాకలో గేదె..



మృతిచెందిన గేదెను పరిశీలిస్తున్న ఆర్ఐ

దుబ్బాక: పిడుగుపాటుతో గేదె మృతిచెందింది. దుబ్బాకకు చెందిన మల్లుగారి దినేశ్ రెడ్డి గురువారం రాత్రి తనపొలం వద్ద గేదె పాలు పిండి ఇంటికి వచ్చాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత పొలంవద్ద పిడుగుపడడంతో గేదె మృతిచెందింది. శుక్రవారం తెల్లవారు జామున తిరిగిపాలు పిండుదామని పొలంవద్దకు వెళ్లగా గేదె మృతిచెంది ఉందని దినేశ్‌రెడ్డి కన్నీటి పర్యంతరమయ్యాడు. ఆర్ఐ నర్సింహరెడ్డి, వెటర్నరీ డాక్టర్ మృతిచెందిన గేదెను పరిశీలించారు. సుమారు రూ.95 వేల పాడిగేదె మృతి చెందిందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చాకలి లక్ష్మణ్ ఉరఫ్ రాజు, రోదిస్తున్న బంధువులు

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురు యువకుల మృతి

నార్సింగి శివారులో ఘటన



ప్రశాంత్, నీలగిరి దుర్గయ్య మృతదేహాలు

పాపన్నపేట(మెదక్): పాపన్నపేట మండలం నార్సింగి శివారులో శుక్రవారం రాత్రి ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. పాపన్నపేట పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. నార్సింగి గ్రామానికి చెందిన చాకలి లక్ష్మణ్ ఉరఫ్ రాజు (25)కు శుక్రవారం పెళ్లి చూపులు జరిగాయి. ఇదేరోజు లక్ష్మణ్ చిన్నాన్న నాగేశ్ ఇంట్లో గొడవలు జరగడంతో ఆయన చిన్న కొడుకు సుమన్ ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దీంతో సుమన్‌ను వెతికేందుకు లక్ష్మణ్, ఆయన అన్న భూపాల్, మరో యువకుడు నీలగిరి దుర్గయ్య బైక్‌పై వెళ్లారు. ఇదే టైంలో టేక్మాల్ నుంచి పల్సర్‌పై ఎదురుగా వస్తున్న పుల్కల్ మండలం ముద్దాయిపేటకు చెందిన ప్రశాంత్ (20) ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రశాంత్, చాకలి లక్ష్మణ్ అక్కడిక్కడే మృతిచెందగా, నీలగిరి దుర్గయ్య(27) ఆసుపత్రిలో చనిపోయాడు. మరో యువకుడు భూపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

చివరి క్షణంలో రక్షించిన గ్రామస్తులు..

ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి వెళ్లిన చాకలి సుమన్ నార్సింగి శివారులో ఓ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రక్షించేందుకు వెళ్లిన గ్రామస్తులు చివరి క్షణంలో ఆయనను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సుమన్ పరిస్థితి నిలకడగా ఉంది. కాగా తమ్ముడిని రక్షించేందుకు వెళ్లిన లక్ష్మణ్ పెళ్లి చూపుల రోజు ప్రమాదంలో చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సర్కార్ మందులు రోడ్డుపాలు



రాంపూర్ శివారులో రోడ్డు పక్కన గోలీలు

అల్లాదుర్గం(మెదక్): రోగులకు ఇవ్వాల్సిన మందులు రోడ్డుపాలవుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రులు.. పీహెచ్‌సీల్లో పేదలకు అందాల్సిన మెడిసిన్స్ పక్క'దారి' పడుతున్నాయి. అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద ప్రభుత్వం సరఫరా చేసిన వివిధ రకాల మందులు పడేశారు. వీటిలో గర్భనిర్ధారణ కిట్లూ ఉన్నాయి. పడేసిన మందుల ఎక్స్పైరీ డేట్ కూడా ముగియకపోవడం విశేషం. రకరకాల మందులు రోడ్డుపై ఎందుకు పడేశారు? ఎవరు పడేశారు? తెలియడంలేదు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపడితేనే వాస్తవ విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.



మందులపై 2024 వరకు ఉన్న ఎక్స్‌పైర్ డేట్

అంధ విద్యార్థినిని అభినందించిన గవర్నర్



భవానిని అభినందిస్తున్న గవర్నర్

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణానికి చెందిన అంధబాలిక భవానీ హైదరాబాద్ బేగంపేటలోని అంధుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఆమె పాఠశాలపై బ్రెయిలీలిపిలో ఓ పుస్తకాన్ని రాసింది. ఆ పుస్తకాన్ని గురువారం రాజ్‌భవన్‌లో అంధపాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గవర్నర్ తమిళిసై ఆవిష్కరించారు.బ్రెయిలీ లిపిలో పుస్తకం రాసిన భవానీని అభినందించారు.

రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా



దీక్ష చేస్తున్న నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో చేపట్టిన దీక్షలు శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ మేరకు రజక సంఘం సభ్యులు పట్టణంలో దీక్ష నిర్వహించారు. ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ ప్రకటించే వరకు విశ్రమించమని రజక సంఘం సభ్యులతో పాటు అఖిల పక్షం ప్రతినిధులు అన్నారు. దీక్షలో రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు వెంకటి, పట్టణ అధ్యక్షుడు కిషన్, పట్టణ ఉపాధ్యక్షుడు లచ్చయ్య, కోశాధికారి బాల్‌రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

310 గ్రాముల గంజాయి స్వాధీనం



నిందితుడితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తూప్రాన్: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాంరెడ్డి కథనం ప్రకారం...శుక్రవారం తూప్రాన్ పట్టణంలోని హైదరగూడకు చెందిన పట్ల యాదయ్య గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం వచ్చింది. సిబ్బందితో కలిసి ఏరియాకు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన నుంచి 310 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలో సిబ్బంది చంద్రయ్య, ఎల్లయ్య, రాజు, హరీశ్, నరేశ్, రవి తదితరులు పాల్గొన్నారని ఎస్సై రాంరెడ్డి వివరించారు.